ప్రజాశక్తి

బుధవారం 4 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విరగబడే వారిపై తిరగబడే చర్య !

◆ బాందేవపురం దళిత యువకునిపై దాడి కేసులో తక్షణ న్యాయం ◆ నగర పోలీస్ కమిషనర్‌కు ప్రశంసలు

◆ విశాఖ గ్రామీణంలో భూస్వామ్య, ఖాకీల జులుంపై చర్యలు

◆ ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌పై సర్వత్రా హర్షం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'పెత్తందార్లపై పేదల పోరాటం' - విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కనిపించే కటౌట్లు ఇవి. ఇందులో ఎంత నిజం ఉందో అందరికీ తెలిసిందే. గ్రామాల్లో దళితులు, పేదలను వంచించే ఘటనలు నేటికీ కొనసాగుతున్నాయనడానికి విశాఖ జిల్లా పద్మనాభం మండలం బాందేవపురం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనే నిదర్శనం. ఒక పెత్తందారుడి ఇంట్లో కోడిపుంజును దొంగిలించాడనే నెపం మోపి కేసుపెట్టి అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు బాందేవపురం పాపును ఇద్దరు కానిస్టేబుళ్లు మద్యం పూటుగా తాగేసి చావబాదిన వైనం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. ఎస్ఐకు విషయం తెలిసినా నిర్లక్ష్యం వహించడం దారుణం. 'ఇంకెక్కడి కుల వివక్ష, దళితులను ఎక్కడ అవమానంగా చూస్తున్నారు. ఆ రోజులు ఎప్పుడో పోయాయి. అంతా కలిసిమెలిసి జీవిస్తున్నారు' అంటూ పెత్తందారీ పోకడలను సమర్థించుకునేవారికి ఈ ఘటన చెంపపెట్టు కాగలదు. పోలీసులు పాలకవర్గాలు, గ్రామాల్లో పెత్తందార్ల చేతిలో ఆయుధాలు అన్న మాటలను నిజం చేసేలాగ పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లు వ్యవహరించారు. అయితే, పోలీసులంతా ఒకేలా లేరు అనేలా విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ ఈ కేసులో వ్యవహరించిన మిగతా 2లో..



పద్మనాభం పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు (ఫైల్‌ఫొటో)



దళిత యువకునిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చర్యలు తీసుకున్న సిపి రవిశంకర్



చెస్ పోటీల్లో తలపడుతున్న పలు రాష్ట్రాల క్రీడాకారులు

హోరాహోరీగా

అండర్ - 11 చెస్ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ పోర్టు స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జాతీయ స్థాయి అండర్ 11 చదరంగం పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఐదో రౌండ్ ముగిసే సరికి బాలుర విభాగంలో ఆన్ష్‌నందన్, సంజయ్, సాయిష్ అమోనకర్, మదేశ్‌కుమార్ ఐదు పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఆంధ్రాకు చెందిన హేమల్ వర్షన్, ఎ.అఖిల్‌ప్రసాద్ 4.5 పాయింట్లతో 9, 10 స్థానాల్లో కొనసాగుతున్నారు. బాలికల విభాగంలో హన్యాషా, వితస్తా కౌల్, ప్రతీతి, ఆంధ్రాకు చెందిన త్రిపురాంబిక ఐదు ప్లాయింట్లతో ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ సభ్యులు శర్మ, భీమారావు, మణికంఠరావు, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లును పర్యవేక్షిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌కు రవిచంద్రన్ ఇంటర్నేషనల్ ఆర్బిటర్‌గా వ్యవహరిసున్నారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్‌కు స్వచ్ఛ భారత్ అవార్డు

▶ వార్త 4లో..

'ఉక్కు' బహిరంగ సభకు తరలిరండి

▶ వార్త 4లో..

7న ఘంటసాల నృత్యరూపక ప్రదర్శన

▶ వార్త 4లో..



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సిహెచ్.నర్సింగరావు తదితరులు

రైతులకిచ్చిన

హామీలను నెరవేర్చాల్సిందే

బ్లాక్ డే నిరసనల్లో నేతలు వార్త 8లో..

14 దొంగతనం కేసులు ఛేదన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల కాలంలో జరిగిన 14 ఇంటి దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. ఆయా కేసుల్లో 14 మందిని అరెస్టు చేశామని, 70 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని విశాఖ క్రైమ్ డిసిపి గంధం నాగన్న తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆ కేసుల వివరాలు వెల్లడించారు. ఇటీవల కాలంలో జరిగిన దొంగతనం కేసులను తమ సిబ్బంది ఎంతో చాకచక్యంగా ఛేదించారని తెలిపారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 1, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 2, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 3, ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, పిఎం పాలెం పరిధిలో 1 ఛేదించినట్టు తెలిపారు. ఆ దొంగతనాలకు సంబంధించి రూ.46 లక్షల విలువ మిగతా 2లో..

ప్రజల చెంతకే వైద్యం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రతి పేదవానికీ మెరుగైన వైద్యం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని అన్నారు. మంగళవారం ఆమె ఇసుకతోట వద్ద వైఎస్ఆర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని తగిన వైద్యం అందించనున్నామన్నారు. 30 వేల జనాభా కలిగిన ప్రతి యుపిహెచ్‌సి పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10,032 పిహెచ్‌సిలు, 542 యుపిహెచ్‌లను కవర్ చేస్తూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మిగతా 2లో..



విద్యార్థికి కళ్లద్దాలు తొడుగుతున్న మంత్రి రజని

మొదటి పేజీ తరువాయి..

విరగబడే వారిపై తిరగబడే చర్య !

తీరు అందరి చేతా శభాష్ అనిపించుకునేలా ఉంది. తాజా ఘటనలో దళిత యువకునిపై దాడి చేసిన వారిపై పోలీస్ కమిషనర్ సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.

అసలింతకీ ఏం జరిగిందంటే..

బాందేవపురం గ్రామానికి చెందిన ఇందుకూరు రాజబాబుకు చెందిన కోడిపుంజును అదే గ్రామానికి చెందిన పాపు, గాలి ఎర్నిబాబు దొంగిలించారంటూ గత నెల 29న పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్పటి నుంచీ నిందితులను సాయంత్రం వేళ విచారిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటలకు నిందితులను పోలీసులు విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ అలా చేయలేదు. అక్కడకు చేరుకున్న నిందితుల బంధువులనూ లోపలకు అనుమతించలేదు. ఆ రాత్రి సమయానే నిందితునిగా ఉన్న పాపు కేకలు, ఏడుపు వినిపించడంతో బంధువులు లోపలకు వెళ్లారు. అప్పటికే ఆయన కాలు విరిగి స్పృహ కోల్పోయి ఉన్నాడు. ఆయన్ని బంధువులు విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

పోలీసులు నిందితున్ని కొట్టారన్న విషయం తెలియగానే గ్రామంలోని కొంతమంది అక్కడకు వచ్చి స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే కానిస్టేబుళ్లు సతీష్. శ్రీనివాస్ గోడ దూకి పరారయ్యారు. క్రైమ్ ఎస్ఐ మల్లేశ్వరరావు ఈ విషయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. స్టేషన్ వద్ద నిందితుని బంధువుల ఆందోళన తీవ్రమవుతున్న విషయం తెలుసుకున్న క్రైమ్ డిసిపి నాగన్న, దిశా పోలీస్ స్టేషన్ ఎసిపి వివేకానంద వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసు కమిషనర్ వెంటనే స్పందించారు. దళిత యువకున్ని విచక్షణా రహితంగా చావగొట్టడం, తొమ్మిది నెలల క్రితం అతని కాలికి ఫ్యాక్చర్ కాగా ఇప్పుడిప్పుడే తగ్గుతున్న క్రమంలో ఖాకీలు ఆ కాలుపై 'థర్డ్' డిగ్రీ ప్రయోగించడంపై ఆగ్రహించారు. దొంగతనం కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి కాలు విరగ్గొట్టారని ప్రాథమిక విచారణలో తేలడంతో ఇద్దరు కానిస్టేబుళ్లపైనా, ఎస్ఐపైనా సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిఐ సన్యాసి నాయకుడుకు ఛార్జి మెమో ఇచ్చారు.

కెవిపిఎస్ హర్షం

బాందేవపురంలో దళిత యువకున్ని దొంగతనం కేసులో ఇరికించి, 'థర్డ్ డిగ్రీ' ప్రయోగంతో కాలు విరిగేలా చేసిన ఘటనపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ స్పందించిన తీరును కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) స్వాగతించింది. ప్రస్తుత వ్యవస్థలో ఇలాంటి అధికారులు మార్పు కోసం ప్రయత్నించడం మంచి పరిణామమని ఆ సంఘం జిల్లా నాయకులు సుబ్బన్న, చిరంజీవి ఓ ప్రకటనలో మంగళవారం ప్రశంసించారు. గ్రామాల్లో పేదలపై ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు భూస్వాములకు, గంజాయి మాఫియాలకు కొమ్ముకాస్తూ స్టేషన్లను అడ్డాగా మార్చేసి పేదలను హింసిస్తున్నారని తెలిపారు. రూ.5 వేలు ఇస్తే వదిలేస్తామంటూ పెత్తందార్లు బాందేవపురంలో పంచాయితీ నిర్వహించడం సరైన పద్ధతి కాదని, పేదవాడైన పాపు ఇవ్వనందున స్టేషన్‌లో పోలీసులచేత పెత్తందారులు దాడిచేయించారని, వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

ప్రజల చెంతకే వైద్యం

10,574 క్యాంపులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నాలుగు వేల మందికిపైగా ప్రభుత్వ, ప్రైవేట్ స్పెషలిస్ట్ వైద్యులు ఈ క్యాంపుల సమయంలో పాల్గొంటారని తెలిపారు. విశాఖ జిల్లాలో 122 క్యాంపులు జరగనున్నాయన్నారు. అనంతరం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పలువురిని పరీక్షించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రామిరెడ్డి, జివిఎంసి అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, డిఎంహెచ్ఒ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఉక్కుపై పాలకుల కుట్రలు దారుణం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలో లాభాలతో నడుస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్న మోడీని, అతనికి మద్దతుగా నిలుస్తున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 913వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వైసిపి, టిడిపి, జనసేనలు చిత్తశుద్ధితో వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపికి మద్దతుగా నిలిచే పార్టీలకు ప్రజలు రానున్న కాలంలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్, సురేష్, కార్మికులు నారాయణమ్మ, కనకరాజు, లక్ష్మి, స్వర్ణ భారతి పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

14 దొంగతనం కేసులు ఛేదన

(మొదటి పేజీ తరువాయి..) గల 70 తులాల బంగారం, ఒక సుజుకి యాక్సెస్ వాహనం, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటికి 14 మందిని అరెస్టు చేశామని, 8 మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. కేసులను ఛేధించిన పోలీసు సిబ్బందిని రివార్డులతో అభినందించారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేయండి

నగరంలోని అపార్టుమెంట్ వాసులు కచ్చితంగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని నాగన్న అన్నారు. నేర నియంత్రణలో సిసి కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు.

22న జర్నలిస్టుల దసరా సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల సారథ్యంలో ఈ నెల 22న జర్నలిస్టుల దసరా సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ్ తెలిపారు. మంగళవారం ఓ హోటల్‌లో ఫెడరేషన్ అర్బన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారీ నగరంలో దసరా సంబరాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ నెల 22 ఉదయం నుంచి అల్పాహారంతో ఈ సంబరాలు ప్రారంభమవుతాయని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, ఇతర అంశాలకు సంబంధించి తమ రాష్ట్ర కార్యవర్గం ముఖ్యమంత్రికి ఇప్పటికే పలుమార్లు నివేదించినట్టు తెలిపారు. త్వరలోనే మరోసారి కలిసి సమస్యలు తెలియజేస్తామన్నారు. నవంబర్ 5న ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఎన్.మధుసూదనరావు, డి.రవికుమార్, ఇరోతి ఈశ్వరరావు, కె.మురళీకృష్ణ, ఉదయ్, ఎన్.రామకృష్ణ, శివప్రసాద్, రంగధామం, కృష్ణమూర్తి, ప్రకాష్, చింతా ప్రభాకరరావు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

సమిష్టి కృషితో ఇళ్ల స్థలాలు సాధిద్దాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : సమిష్టి కృషితో జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చుకొందామని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు జి.జనార్ధనరావు, అధ్యక్షులు బి.రవికాంత్ పిలుపునిచ్చారు. సొసైటీ ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసిందన్నారు. సుమారు 800 మందికిపైగా అక్రిడేటెడ్ జర్నలిస్టులు సభ్యులుగా చేరారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉండటం కలిసి వచ్చే అంశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యర్రా శ్రీనివాస్, సలహాదారులు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు అవినీతి ముత్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు అవినీతి ముత్యమని వైసిపి మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి అన్నారు. మంగళవారం ఉదయం సిరిపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు అవినీతి చేసి దొంగలా ఆధారాలతో సహా పట్టుబడి చంద్రబాబు జైలుకెళ్లారని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.A.232/2023 in 233/2023 in I.A.234/2023 in I.A.990/2016 in O.S.No.78/2008

Between:
1. Mopada Krishna Murthy (died)
2. Smt. Mopada Lakshmi & others .....Petitioners

And:
The Presidency Group represented by its' Managing Director Sri V.Bhaskar Reddy Door No.50-96-4/1/1, Sri Gowri Nilayam, 2nd floor, NE Layout, Seethammadhara, Visakhapatnam ...Respondent

NOTICE

The petitioners filed the above petitions to get them impleaded as LRs of the deceased 1st petitioner as shown above and for permission to prosecute the above suit proceedings by setting aside the default order, dated 08.06.2015. The Honourable Court has been pleased to order the notice through this publication to you and for your appearance on **17.10.2023** either in person or through an Advocate appointed. If fail to do so the matter will be heard ex-parte.

By order
K.SRIHARI SARMA
Advocate, Vizianagaram
Cell: 9441749034

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE, AT VIZIANAGARAM.
F.D.I.A. 631/2018 :: O.S. 70/2012

Between:
Kanakala Adinarayana .....Petitioner/ Plaintiff

And:
Smt. Puranam Rajyalakshmi ....Respondent/ Defendant

To
Smt. Puranam Rajyalakshmi, W/o Venkata Kondamacharyulu, Door No. 22-51-26, Town Hall Road, Near Kurupam Market, Visakhapatnam.

NOTICE

Take notice that the petitioner/ plaintiff filed the above petition for passing Final Decree in terms of the Preliminary decree dated 23-08-2012 passed by the Senior Civil Judge, Vizianagaram directing to pay a sum of Rs. 5,16,195/- with subsequent interest and in default for the sale of the petition schedule mortgaged properties in which you are the respondent and the said petition stands posted to **16-10-2023** for notice to you. If you got any objection in the above petition you can appear in person or through an advocate and file your objections if any on **16-10-2023 at 10-30 A.M** in the above Court.

L.SATYANARAYANA.
Advocate for the Petitioner
Plot No.25, D.No.20-18/1-25,
Sainath Colony,
Near M.R.College Stadium,
VIZIANAGARAM-535002

దావా సమను
మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 192 / 2012

బిట్వీన్:
మాడిమి వెంకట గిరిబాబు . . . వాది
అండ్:
సిహెచ్.వి.సత్యనారాయణ వగైరాలు . . . ప్రతివాదులు

టు: 3వ ప్రతివాది: జ్యోతుల శ్రీదేవి, భర్త నాగేశ్వరరావు, 43 సం॥, డో.నెం. 10-25, ఎ.ఎం.ఎల్.కాలేజీ జంక్షన్ కొత్తూరు, అనకాపల్లి.
4వ ప్రతివాది: మద్దాల మంగాదేవి భర్త మదన్‌మోహన్, 41 సం॥, డో.నెం. 10-25, ఎ.ఎం.ఎల్.కాలేజీ జంక్షన్ కొత్తూరు, అనకాపల్లి.

పై నెంబరు దావాలో మీరు, హాజరు నిమిత్తం **తే:16-10-2023దీకి** వాయిదా అయ్యి ఉన్నది. కావున పైతేదీన **ఉదయం గం.10-30 ని॥లకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని, మీ అడ్వకేటు ద్వారా గాని, హాజరుకావలసినదిగా తెలియజేయడం అయినది. మీరు హాజరు కాని యెడల మీ పరోక్షంలో పై నెంబరు దావా తీర్మాణించబడునని తెలియజేయడం అయినది.

A.V.S.BHAVANI PRASAD
Advocate, Anakapalle,
Cell : 998928366
Anakapalle
Dt. 3-10-2023

PUBLIC NOTICE

I, Gudimetla Kumara Swamy, S/o late Gudimetla Srinivasa Rao, R/o D.No.9- 30-2, Sundaram Colony, Koruprolu, S.Rayavaram Mandal, Anakapalli District, am the absolute owner of the following properties, viz., (a) undivided and unspecified 1/5 th share in dry land in an extent of Ac.0.61 cents out of Ac. 1.54 cents together with shops and a rice mill covered by Sy.No. 119/8 of Thimmapuram Village and Panchayat in Yellamanchili, (b) undivided and unspecified 1/5 th share in land facing east of Trunk road in an extent of 952 Sq.ft or 83-672 Sq.mts out of 624 Sq.yds or 448-544 Sq.mts, (c) undivided and unspecified 1/5 th share in land facing east of Trunk road (Rice mill) in an extent of 3360 Sq.ft or 312-160 Sq.mts out of 373 1/3 Sq.yds or 312-160 Sq.mts with A.C. sheet roof with country wood construction with D.No. 2- 109, (d) The entire western side residential house portion bearing D.No. 9-30-2 together with 200 sq.yds of land appurtenant to it, out of total extent of 400 sq.yds in Sundaram Colony, Koruprolu, S.Rayavaram Mandal, Anakapalli District; having devolved upon me by virtue a WILL dated 10-10-2013 executed by my father in my favour with absolute rights over them and consequent upon the demise of my father on Date 15.1.2015 I became the absolute and law ful owner of the same and have been enjoying the same peacefully and uninterrupt edly. I hereby issue the following public notice calling upon the general public to submit their objections, if any, to me in respect of the above properties within 7 days of publication of this notice; else the same will not be binding on me and no claims will be entertained thereafter.

T. PARDHASARADHI, Advocate, MVP Colony, Visakhapatnam

IN THE HON'BLE COURT OF VI ADDITIONAL DISTRIC JUDGE AT VISAKHAPATNAM
O.S. 30 /2023

Between:
Sri Allu Suresh Naidu . . . Plaintiff
And:
Sri Penta Umamaheswararao & 10 others . . . Defendants

SUIT SUMMONS

To
D-6: Smt Neradebilli Padmavathi
W/o. Apparao, D.No 43-14-31/2,
Srikanya Theatre,
Railway New Colony,
Visakhapatnam-530016

Take suit notice that the above named plaintiffs filed the suit for partition of plaint schedule property as per extents mentioned in the registered sale deed vide document No. 2649 2015 dated 29-7-2015 and for other reliefs on the file of the Hon'ble court mentioned above. The Hon'ble court ordered you to appear before the Court on **2-11-2023 at 10.30 A.M** either personally or through an advocate and to submit your written statement along with documents failing which the Hon'ble court will proceed in your absence by setting you exparte and decide the suit .
(As per orders of the Hon'ble court)

S.K.S.K.SARMA & L.S. NAIDU
Advocates for the Plaintiffs
D.No. 49-5-11
Sugunabhiramanilayam,
Near Sangam Office Junction
LalithHnagar
Visakhapatnam - 16
Cell : 9849230073
Visakhapatnam,
Date: 03-10-2023

గోతులు తీశారు.. పూడ్చడం మరిచారు...

ప్రజాశక్తి -ఆనందపురం : గొట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో జలజీవన్ మిషన్ పనుల కోసం కాలనీలో పైప్ వెయ్యటానికి గొయ్యి తీసి 15 రోజులు గడుస్తున్నా పనులు చేపట్టక పోవడంతో చిన్న పిల్లలతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం గ్రామంలో జల జీవన మిషన్ ద్వారా మంచినీటిని అందించడానికి వీధుల్లో పైపులు వేయడానికి పెద్ద పెద్ద గోతులు తీసి పనులు చేపట్టకుండా వదిలేయడం సమస్యగా ఉంది. గోతుల్లో పడి పిల్లలు ఎటువంటి ప్రమాదాలు తెచ్చుకుంటారేమోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ భూములకు దారిలేక ట్రాక్టర్లతో వెళ్ళటానికి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు పరిశీలించి త్వరగా పనులు పూర్తిచేసే విధంగా చర్యలు చేపట్టాలని జనసేన నాయకులు తాడివాడ ప్రశాంత్ కుమార్, గ్రామస్తులు కోరుతున్నారు.


పైపు లైన్ కోసం వెంకటాపురంలో తీసిన గోతులు



రైతునేస్తం పురస్కారానికి బంగారు ఝాన్సీ ఎంపిక

ప్రజాశక్తి -మధురవాడ : ప్రతిష్ఠాత్మకమైన పద్మశ్రీ డాక్టర్ ఐవి.సుబ్బారావు రైతునేస్తం పురస్కారానికి నగరానికి చెందిన మిద్దె తోట నిర్వాహకులు బంగారు ఝాన్సీ ఎంపికైనట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత, రైతునేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరావు ప్రకటించారు. అక్టోబర్ 14వ తేదీన కృష్ణాజిల్లా గన్నవరం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ద్వారా బంగారు ఝాన్సీ రాణి అందుకోనున్నారని పేర్కొన్నారు. రైతు విభాగంలో 15 మంది, శాస్త్రవేత్తల విభాగంలో 14 మంది, విస్తరణ విభాగంలో 15 మందిని పురస్కార గ్రహీతలుగా రైతునేస్తం ప్రకటించినట్లు తెలిపారు. ఎనిమిదేళ్లుగా మధురవాడలో అతి తక్కువ స్థలంలో మిద్దె మీద సేంద్రియ వ్యవసాయాన్ని చేస్తూ బంగారు ఝాన్సీ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - ఆరిలోవ, ఆనందపురం : ఆరిలోవ పరిధి సుందరయ్యనగర్, శ్రీకాంతినగర్‌లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎంవివి.సత్యనారాయణ, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అందుతున్నదీ, లేనిదీ, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంవివి.సత్యనారాయణ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పనులు కూడా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బాబిరెడ్డి, పీలా జోషిలా, చొక్కర శేఖర్, సత్తి మందరెడ్డి, ఎల్లంపల్లి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం మండలం చందక పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు.

వర్షం పడితే జలమయం

వేములవలస గ్రామసభలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి -ఆనందపురం : వర్షాలు పడితే వేములవలస గ్రామం నీటితో నిండిపోతుందని, నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ సభలో వార్డు మెంబర్లు నిలదీశారు. వేములవలస గ్రామ సచివాలయంలో సర్పంచ్ లంక కొండమ్మ, గ్రామ కార్యదర్శి నర్సింగరావు ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు మాట్లాడుతూ, ఆనందపురం జట్టమ్మ కొండ కూల పూల మార్కెట్ నుంచి లోతులో ఉన్న వేములవలస గ్రామానికి వర్షపు నీరు చేరి ముంపునకు గురవుతుందన్నారు. గతంలో నీరు పోవడానికి ఉన్న కాలువలు కబ్జాకు గురై షాపులు నిర్మించడంతో నీరు పోయే మార్గాలు లేక గ్రామం మొత్తం జలమయం అవుతుందని, సమస్యను పరిష్కరించాలని ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వరరావు కోరారు. వేములవలస పాత సినిమా హాల్ వెనుక రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేసినా నేటికీ పనులు జరగలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ కార్యదర్శి పి.నర్సింగరావు మాట్లాడుతూ, కాలువకు అడ్డంగా ఉన్న షాపులను తొలగించి నీరు పోయే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయడానికి వాగు చెరువు, ధర్మకోనేరు మాత్రమే ఉన్నాయని, ఈ చెరువులో ఇదివరకే పనులు చేపట్టామని, ఉపాధి హామీ పనులు కావాలనుకుంటే వెల్లంకిలోని చెరువుల్లో పనిచేయడానికి వీలు కలుగుతుందని ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సత్య తెలిపారు. పలు వీధుల్లో కాలువలు ఏర్పాటు చేయాలని సభలో సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ అప్పలస్వామి నాయుడు, వార్డు మెంబర్లు అప్పారావు, కోరాడ దామోదరరావు, గోపి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో యూత్ కాన్‌క్లేవ్

నవంబర్ 3,4 తేదీలలో...

ప్రజాశక్తి -మధురవాడ : భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగానికి అనుబంధంగా ఉన్న సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చి బోర్డు (సెర్బ్), ఇండియన్ నేషనల్ అకాడమి ఆఫ్ ఇంజినీరింగ్ సంయుక్తంగా జాతీయ స్థాయి యువ సమ్మేళనం "యూత్ కాన్‌క్లేవ్ -2023"ని ఈ ఏడాది నవంబర్ 3, 4 తేదీలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం మాట్లాడుతూ, యువతలో నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ యువ సమ్మేళనం దోహదపడుతుందన్నారు. గీతం రీసెర్చి డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజాపప్పు మాట్లాడుతూ, "ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఫర్ గ్లోబల్ ఛాలెంజస్" పేరుతో జరుగుతున్న ఈ యువ సమ్మేళనంలో పరిశోధకులు, యువ ఇంజినీర్లు, స్టార్టప్‌పై ఆసక్తి గల యువత జాతీయ స్థాయిలో పాల్గొనున్నారని తెలిపారు. ఐడియా థాన్, స్టార్టప్‌ల ప్రదర్శన, నమూనా ఇంజినీరింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించడం, పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని చెప్పారు. ఈ యువ సమ్మేళనంలో ఆరోగ్యరంగం, అంతరిక్షం, రోబోటిక్స్, గ్రీన్ ఎనర్జీ స్టోరేజ్, స్మార్ట్‌సిటీ అర్బన్‌ప్లానింగ్, బయోమెడికల్ ఇంజినీరింగ్ వంటి రంగాలపై నిర్వహించే పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేస్తామన్నారు. మహిళలకు ప్రత్యేక అవార్డులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనానికి హాజరు కాదలచిన వారు అక్టోబర్ 15వ తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం www.inae.gitam.edu ను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాగేంద్రప్రసాద్, డీన్ ప్రొఫెసర్ విజయశేఖర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పునర్నిర్మాణం ప్రాజెక్టు ప్రారంభం

ప్రజాశక్తి- పిఎం.పాలెం : మధురవాడ గాయత్రీ విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల, వీడీఎం ఇండియా ఆన్ ది మూవ్ స్వచ్ఛందసంస్థ భాగస్వామ్యంతో 'గ్రామపునర్నిర్మాణం' ప్రాజెక్టును మంగళవారం ప్రారంభించారు. వీడీఎం ఇండియా ఆన్ ది మూవ్ సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య అజిత్‌కుమార్ మాట్లాడుతూ, మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యం నెరవేర్చేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామాలాభివృద్ధికి యువత తమవంతు కృషిచేయాలన్నారు. గాయత్రీ విద్యాసంస్థ భాగస్వామ్యంతో, విద్యార్థుల సహకారంతో గ్రామాలను ఎంపికచేసి అక్కడి పరిస్థితులు అంచనా వేసి గ్రామీణుల సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నామని తెలిపారు. అనంతరం ఒప్పంద పత్రాలపై ఇరువర్గాల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ డాక్టర్ కెవిజిఎస్.మూర్తి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.గోస్వామి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-సీతమ్మధార : నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... బాలయ్య శాస్త్రి లే-అవుట్‌లోని సింధూర గెస్ట్ హౌస్‌లో గొర్లె రాకేష్‌కుమార్ గౌడ్ (23) దిగాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ విజయ్‌కుమార్ తెలిపారు.

మృతదేహం తరలిస్తున్న అంబులెన్స్ బోల్తా

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లు జాతీయ రహదారిపై మంగళవారం ప్రైవేట్ అంబులెన్స్ బోల్తా పడిన ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు .కాకినాడ ఆసుపత్రి నుండి మృతదేహాన్ని ప్రైవేట్ అంబులెన్స్‌లో విజయనగరం జిల్లా జామి తరలిస్తుండగా, నక్కపల్లి మండలం, చినదొడ్డిగల్లు వద్దకు వచ్చేసరికి అంబులెన్స్ వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్ వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అంబులెన్స్ వాహనం జాతీయ రహదారిపై బోల్తాపడడంతో, కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.హైవే సిబ్బంది, పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. మరో అంబులెన్స్ వాహనంలో మృతదేహాన్ని తరలించారు .

ఉత్సవ నిర్వాహకులపై కేసు నమోదు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని వినాయక నిమజ్జనోత్సవాల్లో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన26 మంది ఉత్సవ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. ధర్మవరం గ్రామంలో గణపతి నిమజ్జనంలో భాగంగా మహిళలతో అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసిన 14 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గెడ్డపాలెం గ్రామంలో మరో 12 మందిపై కేసు నమోదు చేశామన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగాఉ త్సవ కమిటీలు పాటించాల్సిన నిబంధనలపై పదేపదే ప్రచారం చేస్తూ విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేవిడి విద్యార్థి

ప్రజాశక్తి -పద్మనాభం : విశాఖలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలలో మండలంలోని ఆర్‌వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రేవిడి విద్యార్థి టి.చరణ్ అండర్-14లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు తెలిపారు. విద్యార్థిని పాఠశాల కమిటీ సభ్యులు మరగడ అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.రవికుమార్, ఉపాధ్యాయులు అర్.శంకరరావు, సిబ్బంది అభినందించారు.

అపూర్వ కలయిక

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో 1979-80లో ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులు మంగళవారం డైట్‌లోనే కలుసుకున్నారు. సుమారు 43 ఏళ్ల తర్వాత ఒకే చోట కలియడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. 43 ఏళ్ల క్రితం నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ముఖ్య అతిథిగా హాజరైన అప్పటి గణిత అధ్యాపకులు జి.వెంకటరావు, రిటైర్డ్ లెక్చరర్ మృత్యుంజయరావు, ప్రస్తుత డైట్ ప్రిన్సిపల్ ఎల్.సుధాకర్‌ను వారు సన్మానించారు. జ్ఞాపికలను బహూకరించారు. అప్పటి అధ్యాపకులలో మృతి చెందిన 28 మందికి నివాళులర్పించారు. సభాధ్యక్షులుగా బి.రాజారావు వ్యవహరించారు. ఎల్ ముత్యాలనాయుడు, కె.అప్పారావు, మళ్లీశ్వరి, వివి లక్ష్మి, జి.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : వేములవలస బిపి కల్లాలు రోడ్డులో గాయత్రి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ విధిగా హెల్మెట్ ధరించాలని, తాగి వాహనం నడపకూడదని, ముగ్గురు ఒకే వాహనం మీద వెళ్ళకూడదని, సెల్ ఫోన్ మాట్లాడుతూ, వాహనం నడపవద్దని, రోడ్డు దాటేటప్పుడు రెండువైపులా గమనిస్తూ వెళ్లాలని సూచించారు. స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ వల్ల యువత ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

7న ఘంటసాల నృత్యరూపక ప్రదర్శన

ప్రజాశక్తి-సీతమ్మధార: మధుర గాయకులు ఘంటసాల శత జయంతోత్సవాల సందర్భంగా ఈ నెల 7వ తేదీన ఘంటసాల పాడిన గీతాలతో నృత్య రూపక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఘంటసాల కోడలు, కళా ప్రదర్శిని డైరెక్టర్ పార్వతీరవి తెలిపారు. ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మె మాట్లాడుతూ, ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో భరత నాట్యం, కూచిపూడి నృత్యకారిణిగా అంతర్జాతీయ గుర్తింపు పొందిన విద్యార్థులు, ఇక్కడి కళాకారులతో నృత్య రూపక ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. వేలాది సినీ గీతాలు పాడడమే కాకుండా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 18 నెలలు జైలు జీవితం గడిపిన ఘంటసాలకు భారత రత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వివిధ కళా అంశాలలో సేవలందిస్తున్న డాక్టర్ మీగడ రామలింగస్వామి, ఎబి.బాలకొండలరావు, వేదాంతం రామలింగస్వామిలకు కళా ప్రదర్శిని ఘంటసాల స్మారక పురస్కారాలు అందజేస్తామన్నారు. జాన్స్ మ్యూజిక్ అకాడమి అధినేత ఎఎస్ జాన్ సంగీత నిర్వహణలో ఘంటసాల సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురంధేశ్వరి, మాజీ స్పీకర్ మండలి బుద్ధా ప్రసాద్, ఘంటసాల మరో కోడలు కృష్ణకుమారి రతన్ తదితరులు పాల్గొంటారని చెప్పారు. తొలుత ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్లూటిస్ట్ ఎఎస్.జాన్, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు, స్వర మాధుర్యం అధ్యక్షులు ఎంవిఆర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు బ్లాస్ట్ ఫర్నేస్‌కు స్వచ్ఛ భారత్ అవార్డు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్వచ్ఛభారత్‌లో భాగంగా విశాఖ ఉక్కులో నిర్వహించిన స్వచ్ఛతా పఖ్వాడా పోటీల్లో ఉక్కు బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి మొదటి బహుమతి లభించింది. గాంధీజయంతి సందర్భంగా సోమవారం ఉక్కునగరంలో జరిగిన కార్యక్రమంలో బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాధిపతి సందీప్ కుమార్ భట్టాచార్యకు ఉక్కు సిఎమ్‌డి అతుల్‌భట్ మెమెంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఇన్‌ఛార్జి బి.కృష్ణారావు, మెకానికల్ విభాగాధిపతి పి.వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ విభాగాధిపతి అజయ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ పి.రాజారావు పాల్గొన్నారు. బ్లాస్ట్ ఫర్నేస్ స్వచ్ఛభారత్ టీం సభ్యులు హుస్సేన్, కెవిఎల్ ప్రసాద్, ఎం.శరత్, డాక్టర్ రాజారావు, సుందర్‌కుమార్, రాంబాబును ఉన్నతాధికారులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నతిని సాధించాలి

ప్రజాశక్తి -ములగాడ : విద్యార్థులు భవిష్యత్తులో మంచి ఉన్నతిని సాధించాలని మల్కాపురం సిఐ జిడి.బాబు సూచించారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన కెరీర్ గైడెన్స్ క్లాసులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలు సంపాదించుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను సాధించడానికి కష్టపడి చదువుకొని మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధులకు రూ.35 వేలు విరాళం

ప్రజాశక్తి- ములగాడ : జివిఎంసి 58వ వార్డు పరిధి పిలకవానిపాలెం లక్ష్మీ అమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రాగనేత్ర అసోసియేషన్ ఫర్ ది డిజేబుల్డ్ సొసైటీ ఆధ్వర్యాన అంధులు సంగీత కచేరి నిర్వహించారు. విద్యార్థులందరూ రూ.35 వేలు విరాళాలుగా వసూలు చేసి మంగళవారం అంధులకు అందజేశారు. ఈ మొత్తాన్ని లక్ష్మీ అమర ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ ఎ.వాసుదేవరావు రాగనేత్ర అసోసియేషన్ సిబ్బందికి అందజేశారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలని వినతి

ప్రజాశక్తి- ములగాడ : స్థానికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ ఇండస్ట్రియల్ ఏరియా శ్రామిక శక్తి వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపాదించినా ఏ సంస్థ కూడా పాటించడం లేదని జెసికి వివరించారు. దీనికి జాయింట్ కలెక్టర్ స్పందిస్తూ పరిశ్రమల యజమానులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' బహిరంగసభకు తరలిరండి

పలుచోట్ల సిపిఎం నేతల ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన ఉక్కు రక్షణ యాత్ర ముగింపు సభకు ప్రజలు తరలిరావాలని కోరుతూ సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. సభలు, సమావేశాలు, ఆటోజాతాలు నిర్వహించి చైతన్యం కల్పించారు.

గాజువాక : గాజువాక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ, ఆంధ్రుల అశేష త్యాగాల ఫలితంగా ఏర్పడిన ప్లాంట్‌ను అమ్మడమంటే ఆంధ్రుల ఆత్మ గౌరవం దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ప్లాంట్ అమ్మాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొని, పూర్తి స్థాయిలో నడిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెంలో నిర్వహించే బహిరంగ సభకు సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ప్రజలు, కార్మికులు వారి కుటుంబాలతో సైతం పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ, మోడీ అండదండలతో ఒకవైపు అదాని, మరోకవైపు జిందాల్ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను, భూములు కాజేయాలని సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కుట్రలను తిప్పికొట్టడానికి ప్రతి కార్మికుని మద్దతూ అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి పి.శ్రీనివాసరాజు, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, మాట్లాడారు.

బహిరంగసభను జయప్రదంచేయాలని కోరుతూ ఐద్వా ఆధ్వర్యాన శ్రీలానగర్‌లో కరపత్రాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జి.మణికుమారి, సునీత పాల్గొన్నారు.

ఉక్కునగరం : బహిరంగ సభను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ ఆధ్వర్యాన ఎస్ఎంఎస్ డిపార్ట్‌మెంట్‌లో సమావేశం నిర్వహించారు. కార్మికులందరూ హాజరుకావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ నాయకులు బి అప్పారావు, పివి రమణమూర్తి, రాజబాబు, తౌడన్న, కృష్ణమూర్తి, రమణ, కృష్ణ, వి.ఎం.నాయుడు, ఎల్‌బి.నాయుడు, జిఎం.నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

సీతమ్మధార : బహిరంగ సభను జయప్రదంచేయాలని కోరుతూ అక్కయ్యపాలెం ఎఎస్ఆర్.నగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి రాజు, అప్పలరాజు, సుందరమ్మ లక్ష్మి, అప్పన్న పాల్గొన్నారు.

ములగాడ : హెచ్‌పిసిఎల్ కళ్యాణి గేటు వద్ద సభ నిర్వహించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు ప్రసంగించారు. కూర్మన్నపాలెంలో జరిగే బహిరంగసభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.కృష్ణారావు, సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, జి.నరేష్, డి.రాజేష్, ప్రేమ్ రాజు, నీలయ్య, హరి, దాసు, అచ్యుతరావు పాల్గొన్నారు.

భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన ఆటో ప్రచారం నిర్వహించింది. విడిఆర్ ఐపిఎల్ చటర్జీ గొడౌన్స్ వద్ద ఆటో ప్రచారాన్ని సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు ప్రారంభించారు. కంపెనీ గొడౌన్స్ ప్రాంతాలు, ఏడు వార్డుల్లోను ఆటో ప్రచారం నిర్వహిస్తున్నట్లు పైడిరాజు తెలిపారు. ఈ ప్రచారంలోముఠా కార్మిక సంఘం నాయకులు కాటంరావు రాజబాబు, సన్యాసిరావు, అప్పలనాయుడు, పైడయ్య, ప్రజాట్యమండలి నాయకులు వై.గంగాధర్, కె.శరత్, ఎ.జగదీష్ పాల్గొన్నారు.

ఆరిలోవ : సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన బాలాజీనగర్‌లో బహిరంగసభ, ప్రచార జాతా నిర్వహించారు. ఆటో జాతా ఆరిలోవలోని శ్రీకాంత్‌నగర్, అంబేద్కర్ కాలనీ, బిఎన్ఆర్ కాలనీ, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్ గ్రామ సంఘాలల్లో జాతా సాగింది. ఇంటింటికీ కరపత్రాలను నాయకులు పంపిణీ చేశారు. సంత వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జోన్ కార్యదర్శి వి.నరేంద్రకుమార్, నాయకులు పి.శంకర్, లక్ష్మి, కుమారి, సూర్యనారాయణ, నూర్జహాన్, సన్యాసమ్మ పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రచార జాతాను పిఠాపురం కాలనీ మార్కెట్ వద్ద పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ ప్రారంభించారు. మోడీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రలను వివరిస్తూ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆటో జాతా మద్దిలపాలెం, సీతమ్మధార, హెచ్‌బి.కాలనీ, సింహాద్రిపురం, వెంకోజీపాలెం, ఎంవిపి కాలనీ, జాలారిపేట, శివాజీపాలెం ప్రాంతాల్లో తిరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు కుమారి, ఎంవి.త్రినాధరావు పాల్గొన్నారు.



హెచ్‌పిసిఎల్ కళ్యాణి గేటు వద్ద కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు




ఆటోజాతానుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్



స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో సమావేశమైన ఉక్కు కార్మికులు

స్టీల్ కార్మికులకు వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని స్టీల్ సిఐటియు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైటి.దాస్, యు.రామస్వామి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన డైరెక్టర్ (పర్సనల్), డైరెక్టర్ (ఫైనాన్స్) సురేష్ చంద్ర పాండేను వారి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, గడచిన మాసానికి జీతాలను చెల్లించడంలో కూడా జాప్యం వహించడం యాజమాన్య అసమర్ధతకు తార్కాణమన్నారు. కార్మికులకు జీతాలు చెల్లించడంలో ఇటువంటి సందర్భాలు పునరావృతం కాకూడదన్నారు.



సురేష్‌చంద్ర పాండేకు వినతిపత్రం అందిస్తున్న స్టీల్ సిఐటియు నాయకులు

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ, బ్లాస్ట్ ఫర్నేస్-3ని ఉత్పత్తిలో పరుగులు పెట్టించి తద్వారా కొత్త జీతాలను చెల్లిస్తామన్న సిఎమ్‌డి మాటలు నీటిపై రాతలుగా మారుతున్నాయని విమర్శించారు. బిఎఫ్-3తో పాటు బిఎఫ్-2లో కూడా ఉత్పత్తి నిలిపి వేస్తామన్న చర్యను తక్షణం ఉపసంహరించుకొని, పూర్తి సామర్ధ్యంతో ప్లాంట్‌ను నడపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, కె.గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, మరిడయ్య, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి బెంచీల వితరణ

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం 30 పడకల ప్రసూతి ఆసుపత్రికి రూ.30 వేలు విలువైన బెంచీలను మంగళవారం ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. వైద్యం కోసం వచ్చిన మహిళలు కూర్చోవడానికి తగినన్ని బెంచీలు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని హుడా కాలనీ ప్రజలు గుర్తించారు. కాలనీ వాసులు రూ.30 వేలు విరాళాలు ఎత్తుకొని 6 బెంచీలు తయారు చేయించారు. ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దాతల వితరణ గుణాన్ని కొనియాడారు. నూతనంగా నిర్మించిన హాస్పిటల్ భవనాన్ని సందర్శించి, వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మజ్జూరి శ్రీనివాసరావు, కొల్లు అప్పారావు, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, ఉప్పు స్వామి బాబు, గొల్లపూడి విశ్వనాథగుప్త, నీరుకొండ సత్యనారాయణ, మజ్జూరి ఈశ్వర్ ప్రవీణ్ రాజ్, కాలనీ ప్రెసిడెంట్ కృష్ణారావు, సెక్రటరీ మోహనబాబు, సభ్యులు సబ్బవరపు రమణ, చంద్రశేఖర్, ఆనందకుమార్, వేమవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా డబ్ల్యుఎఫ్‌టియు ఆవిర్భావ దినోత్సవం



సిఐటియు ఆధ్వర్యాన అనకాపల్లిలో మానవహారం చేస్తున్న కార్మికులు

ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) వ్యవస్థాపక దినోత్సవం సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం, నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రపంచ కార్మిక సంఘాల వ్యవస్థాపన దినోత్సవం సందర్భంగా మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో అనకాపల్లి బైపాస్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్మిక హక్కులపై పాలకుల చేస్తున్న దాడికి నిరసనగా దేశంలో కార్మిక చట్టాలు మార్పు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు రుత్తల శంకర్రావు తెలిపారు. దేశంలో 44 కార్మిక చట్టాల మార్పు చేసి, 12 పని గంటల పెంపు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు పాలకులు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, పని భద్రత లేక కార్మిక వర్గం అల్లాడుతుందన్నారు. రాబోయే కాలంలో పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, రమణ, కొండాజీ, నాయుడు, బేవరేజెస్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాంబిల్లి : ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం రాంబిల్లి మండలం, గోవిందపాలెం వద్ద సిఐటియు ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, డివైఎఫ్ఐ నాయకులు అరకుడు, సిహెచ్.శివాజీ, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.



రాంబిల్లిలో నినాదాలు చేస్తున్న కార్మికులు

విశాఖ కలెక్టరేట్ : వరల్డ్ ఫెడరేషన్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మంగళవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్మిక వ్యతిరేక విధానాలు ఆపాలని, కనీస వేతనాలు అమలు చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి జిఎస్‌కె.అచ్యుతరావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, సిఐటియు నాయకులు పి.వెంకటరావు, సత్యన్నారాయణ, కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎపి రైతు సంఘం నాయకులు

అనకాపల్లిని కరువు జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. అనకాపల్లి కార్మిక, కర్షక భవనంలో మంగళవారం సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నడూలేని విధంగా తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను, కూలీలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వర్షాలు సక్రమంగా సకాలంలో పడకపోవడంతో జిల్లాలో వరినారు ఎండిపోయిందని, అడపాదడపా పడిన వర్షాలకు వేసిన వరి పంట కూడా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వెంటనే కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రైతులు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని, తేలిక పాటి పంటలు వేయడానికి కావలసిన విత్తనాలు రైతులకు రైతు భరోసా కేంద్రాలు ద్వారా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రైతులను, వ్యవసాయ కూలీలను ఆదుకోవడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు ప్రారంభించి పనులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండి నాయనబాబు, ఎస్.నారాయణమూర్తి, ఎస్.వి.నాయుడు, బి.నాగేశ్వరరావు, వై.దేముడు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి ఎంవిఆర్ విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని రామాపురం పంచాయితీలో ఉన్న నలమారమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) విరాళం అందజేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎంవిఆర్ కార్యాలయంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఎంవిఆర్‌ను కలిశారు. ఆలయ పునర్నిర్మాణం కొరకు తన వంతుగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం ఎంవిఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్ మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుతూ భవిష్యత్ తరాల వారికి ఉపయోగపడే విధంగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో మెలగాలన్నారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, నల్ల మారమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు

ఎస్ఎఫ్ఐ, సిఐటియు కృషితో బడి బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి-చోడవరం

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), సిఐటియు కృషి ఫలితంగా బడి బస్సును ఆర్టీసీ అధికారులు పునరుద్ధరించారు. మండలం అన్నవరం బీసీ బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్ నుంచి చోడవరం కొత్తూరు జంక్షన్‌లోని గర్ల్స్ హైస్కూల్‌కు రోజూ రాను పోను 4 కిలోమీటర్ల దూరం విద్యార్థులు నడవలేక తమకు బడి బస్సు పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19వ తేదీన భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. బడి బస్సు లేక మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులు రోజూ నడిచి వెళ్లి రావడంతో అనారోగ్య పాలు కావటం, ప్రమాదాలు గురుకావటం, మార్గమధ్యలో మద్యం షాపులు ఉండటంతో వేధింపులు గురి కావటం వంటి ఘటనలతో ఇబ్బందులకు గురయ్యారు. ఇది గ్రహించిన ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు బడి బస్సు కావాలని అన్నవరం నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ప్రదర్శన నిర్వహించి, మానవహారం చేసి ఆందోళన చేశారు. అనంతరం జిల్లా అధికారులకు, అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చి గతంలో ఉన్న బడి బస్సును వెంటనే పునరుద్ధరించాలని పదేపదే కోరారు. ఇటీవల ఉచిత పాసులను కూడా నాయకులు దగ్గరుండి చేయించి అందరికీ పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం మంగళవారం నుంచి బడి బస్సును పునరుద్ధరించింది. దీంతో విద్యార్థినులు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. బడి బస్సు రావడానికి కృషి చేసిన సిఐటియు నాయకులు గూనూరు వరలక్ష్మి, వి.వి.శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు ఎస్‌వి నాయుడు, చంద్రశేఖర్, ఉపాధ్యాయ నాయకులు కె.గోవిందు, ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, రమణ, ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ తదితరులకు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలియజేశారు.



బస్సు వద్ద ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు, విద్యార్థులు, కండక్టర్

తాగునీటి బావి నుంచి పొలాలకు నీరు తరలింపు ఆపాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని మల్లం గ్రామంలో బరి నుయ్యి పేరుగల మంచినీటి బావి నుండి పొలాలకు తాగునీటి తరలింపు ఆపాలని గ్రామానికి చెందిన బర్ల అప్పలనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ బావి నుండి నీటిని అప్పంపాలానికి చెందిన కొంతమంది రైతులు నీటి ఇంజన్ సహాయంతో మంగళవారం పొలాలకు తోడారని తెలిపారు. సదరు నుయ్యి నుండి నీటిని, నీటి ఇంజన్ సహాయంతో పొలానికి తోడుతుండడంతో గ్రామస్తుల తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామస్తుల అధిక సంఖ్యలో సదర నూతి నేటినే తాగు నీటి కోసం వినియోగిస్తున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అప్పలనాయుడు కోరారు.

రాష్ట్రస్థాయి త్రో బాల్ పోటీలకు బేబి ఎంపిక

ప్రజాశక్తి - యలమంచిలి

ఉమ్మడి విశాఖజిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి త్రోబాల్ జట్టులో తమ పాఠశాలలో చదువుతున్న యర్ర బేబి చోటు సాధించిందని మండలంలోని పురుషోత్తపురం పాఠశాల హెచ్ఎం డి.శోభారాణి, పిడి సూర్యప్రకాశరావు మంగళవారం తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యాంద్ర బేబి అండర్ 14 విభాగం జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. స్కూల్‌గేమ్స్‌లో అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎదిగిన బేబీని అభినందించిన వారిలో మండల ఉపాధ్యక్షులు రాజాన శేషు, ఉపాధ్యాయులు మల్లిపాటి సత్యనారాయణ, ఎస్.నానిబాబులు ఉన్నారు.



జిల్లా స్థాయి పోటీలో సాధించిన మెడల్ చూపుతున్న బేబి

జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌తో రైతులకు మేలు

కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ఉపయోగించుకొని జిల్లాలోని రైతులు, నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకం ద్వారా అభివృద్ధి చెందవచ్చని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి చెప్పారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్‌లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఏర్పాటుచేసిన నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అవగాహన సదస్సును ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు పథకాలలో రాయితీపై గొర్రెలు మేకలు పెంపకం దారులకు రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సబ్సిడీ పొందవచ్చని తెలిపారు. ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని కోరారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ ఆన్లైన్లోనే ఎటువంటి రుసుము చెల్లించకుండా నేరుగా దరఖాస్తు చేసుకునే విధానం చాలా బాగుందని సబ్సిడీతో చాలామంది వ్యవసాయ దారులు యువకులు ముందుకి వస్తారన్నారు. జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ బి. ప్రసాదరావు మాట్లాడుతూ జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌లో ఉన్న పథకాలను వాటి సబ్సిడీ వివరాలను వివరించారు. మేకలు గొర్రెలు పెంపకం యూనిట్ ప్రాజెక్టు కోటి రూపాయలకు సబ్సిడీ రూ. 50 లక్షలు, కోళ్ల అభివృద్ధి పథకం ప్రాజెక్టు రూ.50 లక్షలకు సబ్సిడీ రూ. 25 లక్షలు, పందుల పెంపకం పథకం రూ.60 లక్షలకు సబ్సిడీ రూ.30 లక్షలు, పై వాటన్నింటికీ దానా తయారీకి ప్రాజెక్టు కోటి సబ్సిడీ రూపాయలకు సబ్సిడీ రూ.50 లక్షలు ఉంటుందని చెప్పారు. అనంతరం సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. ప్రసాద్ రావు రిసోర్స్ పర్సన్‌గా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం డివిజన్ డిడి డాక్టర్ ఎస్. కరుణాకరన్, జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ బి.రామ్మోహన్, నర్సీపట్నం డివిజన్ డిడి డాక్టర్ సిహెచ్.నరసింహులు, విశాఖపట్నం సమగ్ర జీవాల అభివృద్ధి సంస్థ ఏడి డాక్టర్ ఎస్.శ్రీనుబాబు, విశాఖ ఉమ్మడి జిల్లా గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు గంట శ్రీరామ్, జిల్లాలోని ఔత్సాహిక రైతులు, యువకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



బెల్లం పులుపు డ్రమ్స్‌ను బయటకు తీసిన పోలీసులు

2,500 లీటర్ల నాటుసారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి గ్రామ సమీపంలో నాటు సారా వంటకాలు నిర్వహిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ డి.నాగేంద్ర మంగళవారం తన సిబ్బందితో నాటు సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లపు పులుపు సుమారుగా 2,500 లీటర్లను పూర్తిగా నేలమట్టం చేసి, ఆ ప్రదేశాన్ని క్లీన్ చేశారు. నాటు సారా తయారీకి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాలాబులో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని గిరిజన ప్రాంతమైన వాలాబు పంచాయతీలో దేవరాపల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ ఎస్.అలేఖ్య మంగళవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు ముందస్తు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. అనంతరం పాడి రైతులను, గొర్రెలు, మేకల, పెంపకం దారులను సమావేశపరిచి సీజనల్ వ్యాధులు పట్ల తీసుకొవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

5న మరిడిమాంబ పండగ


ప్రజాశక్తి-మునగపాక రూరల్ : ఈనెల 5వ తేదీన జరిగే మరిడిమాంబ పండగను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అమ్మవారి పండుగ సందర్భంగా స్థానిక నందీశ్వర కళా ప్రాంగణం వద్ద జిల్లా స్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అదే రోజు రాత్రి మందబైల రామాలయం వద్ద శ్రీలక్ష్మీ కళా యూనియన్ మునగపాక వారిచే "లక్ష్మణ గీత" అనే సాంఘిక నాటకం ప్రదర్శింప పడుతుందని తెలిపారు. కళాభిమానులు, క్రీడాభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

వెంకటేశ్వర దేవస్థానం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక దేవుని గుమ్మం శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీని మంగళవారం లెక్కించారు. 42 రోజులకు గాను రెండు లక్షల 56వేల 842 రూపాయలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి ఆర్‌విఎస్ఎస్ గౌరీ, ఆలయ ఈవో కె.ఆదినారాయణ, ఆలయ చైర్మన్ సకల రాజ్యలక్ష్మి గోవిందరావు, ధర్మకర్తలు ఉమ్మిని పైడిరాజు, సుంకర వెంకటేశ్వర రావు, శ్రీధరాల కోమలి, సూరిశెట్టిచిన్న, సన్యాసిరావు, రాజన లక్ష్మీ శ్రీనివాస్, అర్చకులు పి గిరిబాబు, శ్రీహరి సేవా సభ్యులు వైజాగ్ వాస్తవ్యులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎస్.రాయవరానికి చెందిన జి.ప్రకాష్‌కు సిఎం సహాయ నిధి నుండి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మంగళవారం కె.కోటపాడులో అందజేశారు. ప్రకాష్ ఊపిరితిత్తులకు సంబందించిన అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందారు. ఆరోగ్యశ్రీలో సంబంధిత సేవలు లేకపోవడంతో ఇందు నిమిత్తం అయిన ఖర్చును వివరాలతో సహా సీఎం రిలీఫ్ ఫండ్ కోసం డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకొచ్చి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేశారు. ఈ మేరకు ప్రకాష్ వైద్యానికి అయిన రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్‌ను సదరు ప్రకాష్‌కు ఉపముఖ్యమంత్రి అందజేశారు. జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు

పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి -యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు.

తగరపువలస : భీమిలి మండలం, టి.నగరపాలెం గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎబి మల్లికార్జునరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది హాజరై పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు చాయాగౌతమి, ఎంపిటిసి సభ్యులు పల్లా నీలిమ, చెల్లూరి నగేష్‌బాబు పాల్గొన్నారు

మధురవాడ : 7వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పోతిన శ్రీనివాసరావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, కుడితి రామారావు పాల్గొన్నారు.

గోపాలపట్నం : స్థానిక కుమారి కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. కారర్యక్రమంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, జి.అప్పలస్వామినాయుడు, గేదెల మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. 300 మందికి వైద్యులు వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అడప లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, సూర్యనారాయణ, బంక సత్యం, మజ్జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని పాకలపాడు గ్రామంలో స్థానిక సర్పంచ్ రాజాన పద్మ, ఎంపిటిసి లక్ష్మీ దుర్గ ఆధ్వర్యంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో 18 రకాల వైద్య పరీక్షలు 108 రకాల మందులు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్యామ్, డాక్టర్ మధుసూధన్, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీను, ఎంపిడిఒ డేవిడ్‌రాజు, ఇఒపిఆర్‌డి రఘు, మండల ప్రధాన కార్యదర్శి పత్తి రమణ పాల్గొన్నారు.



రావలమ్మపాలెంలో ఆరోగ్య సురక్షను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

దేవరాపల్లి : ప్రతి ఇంటికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని కాశీపురంలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. కార్యక్రమంలో దేవరాపల్లి పీహెచ్సీ వైద్యాధికారిణి ఎస్.లలిత, డాక్టర్ బి.హారిక పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని గవరపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. 237 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, పలువురిని పైస్థాయి ఆసుపత్రులకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ, అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, ఎంపిడిఓ సచిదేవి, లంకవానిపాలెం పిహెచ్‌సి వైద్యాధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం జెడ్‌పి హైస్కూల్ ఆవరణలో గ్రామ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రారంభించారు. సుమారు 500 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, ఎంపీడీవో రమేష్ నాయుడు, తహశీల్దార్ బి సత్యనారాయణ, సబ్బవరపు త్రినాధ రామకాసు, కోటాన రాము, చొక్కాకుల గోవింద్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం ఎలిమెంటరీ స్కూల్‌లో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కనకరావు, ఇఒపిఆర్డీ రమేష్ నాయుడు, మండల ఇంజనీర్ ఆఫీసర్ రామారావు పాల్గొన్నారు

రాంబిల్లి : మండలంలోని గోవిందపాలెం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజు, మాజీ డిసిసిబి చైర్మన్ యు.సుకుమార్ వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని మారేడిపూడి గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి గొర్లె సూరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్‌ఓ డాక్టర్ హేమంత్, ఎంపీడీవో నరసింహారావు, సర్పంచ్ సాలపు కనకరాజు, ఎంపీటీసీ ఈగల రాము నాయుడు పాల్గొన్నారు.

పునరావాసం కల్పించాలని

చిన్నపూడి నిర్వాసితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న చిన్నపూడి నిర్వాసితులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పరిశ్రమల మధ్య నివాసయోగ్యలేని చిన్నపూడి గ్రామాన్ని తరలించి పునరావాసం కల్పించాలని ఆ గ్రామ నిర్వాసితులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం అచ్చుతాపురం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ ఇక్కడి ఎస్ఇజెడ్ కోసం ఈ గ్రామస్తులు భూములు ఇచ్చారన్నారు. ఈ గ్రామానికి ఆనుకొని ఏషియన్ పెయింట్స్, దాని సమీపంలో రోడ్డు అవతల ఈటిపి ప్లాంట్ ఏర్పాటు చేయడంతో తీవ్రమైన కాలుష్యంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బంది పడ్డారని తెలిపారు. రాత్రి వేళల్లో వాయు కాలుష్యంతో వాసన భరించలేక తలుపులు వేసుకొని నిద్ర పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీరు కలుషితమైందని ఏషియన్ పెయింట్ యాజమాన్య ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ నీరు తాగడానికి బాగోలేక రోజుకి రూ.20 పెట్టి 20 లీటర్లు కొనుక్కొని తాగుతున్నారని పేర్కొన్నారు. ఈ గ్రామంలో ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకుని బతుకుతున్నారన్నారు. భూములు తీసుకున్నప్పుడు వృద్ధులకు గేదలు, ప్రతి కుటుంబానికి ఆర్ కార్డులు, చదువుకున్న పిల్లలకు ఉద్యోగం ఇస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కాలేదని తెలిపారు. నేడు కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చిన్నపూడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కూండ్రపు సోమునాయుడు, గ్రామస్తులు జయమ్మ, నూకరత్నం, అప్పలనరస, నిర్వాసితులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారి సరుకుల వేలానికి టెండర్లు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి నూకాంబికా అమ్మవారి దేవస్థానానికి వచ్చే సరుకుల వేలానికి పేపర్ ప్రకటన ద్వారా, ఆన్‌లైన్ ద్వారా పిలిచిన ఓపెన్ వేలం పాటలకు శ్రీనూకాంబికా దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌ల సమక్షంలో మంగళవారం టెండర్లు నిర్వహించి స్వీకరించారు. రసవర్గాలు సరఫరా, అమ్మవారికి భక్తులు సమర్పించే తలనీలాలు తీసుకునే హక్కు, అమ్మవారి ఫోటోలు, డాలర్లు సరఫరా చేయు నిమిత్తం, షామియానాలు కుర్చీలు అద్దెకు సరఫరా చేయు నిమిత్తం, పూలదండలు, పుష్పాలంకరణ సరఫరా చేయు నిమిత్తం, అమ్మవారికి భక్తులు సమర్పించి వదిలివేసిన చీరలు తీసుకునే హక్కు నిమిత్తం ఈ టెండర్లు పిలుస్తున్నారు. టెండర్లు పరిశీలించి ఫైనలైజ్ చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మి శ్రీనివాసరావు, ఆడారి ఉమా శ్రీనివాసరావు, గొల్లవిల్లి నర్సింగరావు, పాముల సన్నిబాబు, మల్లవరపు ఈశ్వరరావు, యనమండ్ర శ్రీనివాసు,దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ ధర్మకర్తలు

కళాకారుల గుర్తింపు కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లాలో కళాకారులకు గుర్తింపు కార్డులు జారీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.ఇంద్రావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళలు, పౌరాణిక సాంఘిక నాటకాలు, వీధి నాటకాలు, హరికథలు, బృంద గానాలు, డప్పు వంటి కళారూపాలలో ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులకు సమాచార శాఖ కమిషనర్ గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు చెప్పారు. వృత్తి కళాకారులు తమ కళారూపంలో గల అనుభవాన్ని, ప్రశంసా పత్రాలు, కళారూపం ప్రదర్శన ఫోటోలతో తాము కళాకారులమని ధ్రువీకరిస్తూ స్థానిక తహశీల్దారు లేదా ఎండిఓ వారి సంతకంతో ధ్రువపత్రం, వారి పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు రెండు జత చేసి నియమిత ప్రొఫార్మాలో సమాచార పౌర సంబంధాల అధికారి, జిల్లా కలెక్టర్ వారి కార్యాలయం రూమ్ నెంబర్ 12, రేబాక పోస్ట్, అనకాపల్లికి ఈనెల 10వ తేదీలోగా అందజేయవలసిందిగా కోరారు.

వాడ్రాపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మండలంలోని వాడ్రాపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామంలోని అభివృద్ధి పనులు, ఎన్ఆర్ఈజీఎస్ పనితీరు, శానిటేషన్, జగనన్న హౌసింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని విధాలుగా అందుబాటులో ఉండాలని సూచించారు. జగనన్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలని సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామ జోగినాయుడు, మల్ల జోగారావు, మల్ల అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు, వాలంటీర్లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

శారీరక వికలాంగుల కష్టాలు పట్టవా?

- ◆ ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రత్యేక సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- ◆ ర్యాంపు, రెయిలింగ్ లేక ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, వికలాంగులు



కారుడోర్‌ను ఆసరాగా తీసుకొని మెట్లు దిగుతున్న తహశీల్దార్ జానకమ్మ(ఫైల్)

ప్రజాశక్తి-కోటవురట్ల : వివిధ పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే శారీరక వికలాంగులు, వృద్ధులు నానా ఇబ్బందులు పడుతున్నా, పట్టించుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు వచ్చే వికలాంగులకు ఇబ్బందులు పడకుండా ర్యాంపులు, రైలింగ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ర్యాంపులు మచ్చుకైనా కానరావు. దీంతో వివిధ పనులపై వచ్చే శారీరక అంగవికలురు, వృద్ధులు మెట్లు ఎక్కి కార్యాలయాల్లోకి వెళ్లేందుకు నానా ఇక్కట్లు పడుతున్నారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయం, గ్రంథాలయం సహా పలు కార్యాలయాల వద్ద ర్యాంపు సౌకర్యం లేదు. దీతో సిబ్బందితోపాటు శారీరక వికలాంగులు కార్యాలయాలకు వచ్చే వద్ధులు అవస్థలు పడుతున్నారు. ఇతరుల సాయం తీసుకుని డేక్కుంటూ కార్యాలయాల్లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ముఖ్యంగా శారీరకవికలాంగులు మెట్టుఎక్కి వెళ్లేందుకు పడుతున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీకాదు.కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నా పట్టించుకునే దిక్కులేదు ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయాల వద్ద శారీరక వికలాంగులు, వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సునాయాసంగా వచ్చి, వెళ్ళేందుకు వీలుగా ర్యాంపులు, రెయిలింగ్ వంటిసౌకర్యాలను ఏర్పాటు చేయాలని పలు సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత



అవగాహన కల్పిస్తున్న నాయుడు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : కీటక జనిత డెంగీ, చికెన్ గున్యా,మలేరియా , ఫైలేరియా , మెదడు వాపు జ్వరాలు వ్యాప్తి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇన్‌ఛార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి పిజెఎంఆర్‌పి.నాయుడు ప్రజలకు అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలో సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యస్ రాయవరం సచివాలయం 2 పరిధిలో జిల్లా మలేరియా అధికారి కె వరహాలు దొర ఆదేశాలతో ఆకస్మికంగా సందర్శించి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిసరాల పరిశుభ్రత, దోమలు విజృంభించకుండా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్వైజర్ ఎస్ఎస్‌వి.ప్రకాష్ పర్యవేక్షణలో యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్పేస్ స్ప్రే, మురికి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఎబెట్ ద్రావణం ఔట్ డోర్ స్ప్రే, వంటి పనులను ఫ్యామిలీ ఫిజీషియన్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు పి.ఎన్.వి.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఓ జి.కొండబాబు, సచివాలయం హెల్త్ సెక్రటరీ పి.నూకరత్నం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు కక్ష పూరితమే

'బాబుతో నేను' నిరసన దీక్షల్లో టిడిపి నేతలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న బుద్ధ

ఎస్ రాయవరం :తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా రిలే మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం ఆధ్వర్యంలో మంగళవారం దారపూడి మరిడిమాంబ ఆలయానికి ర్యాలీగా వెళ్లి పూజలు చేశారు. అనంతరం రిలే దీక్షలో నియోజవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. టిడిపి రిలేదీక్షకు స్థానిక జనసేన కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ చంద్రబాబుపై కక్షపూరితంగా పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన అప్పలరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్, అల్లు నరసింహమూర్తి, మోహన్ రావు, పాల్గొన్నారు.

రోలుగుంట : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని కుసర్లపూడిలో బాబుతో నేను' కార్యక్రమంలో ' తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీష్, చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాడ నాగసూర్య చంద్రుడు, రోలుగుంట ఎంపిటిసి సుర్ల రామకృష్ణ, క్లస్టర్ ఇంచార్జి సుర్ల బాబులునాయుడు, మాజీ సర్పంచ్ లగుడు సత్తిబాబు, ఉలభల పోతురాజు నాయుడు పాల్గొన్నారు.

బండారు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి- అనకాపల్లి

టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని అరెస్టు చేయడం అన్యాయమని బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బండారును అక్రమంగా అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏపీలో పోలీస్ వ్యవస్థ సర్కార్ చేతిలో కీలుబొమ్మగా మారిందని మండిపడ్డారు. గతంలో వైసీపీ నేతలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, మంత్రి రోజా, అసెంబ్లీ సాక్షిగా బూతులతో రెచ్చిపోయినా, బయట శ్రీరెడ్డి, పోసాని కృష్ణమురళి బూతుల పంచాంగం వినిపించినా స్పందించని పోలీస్‌శాఖ బండారు సత్యనారాయణ మూర్తి విషయంలో ఎందుకు అంత అత్యుత్సాహం ప్రదర్శించిందని ప్రశ్నించారు. ఉత్తరాంధ్రలో టీడీపీకి మద్దతుగా ఉన్న బీసీలను వైసీపీ టార్గెట్ చేసుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. బండారును విడుదల చేయకుంటే తీవ్ర పరిణామాల్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాంబిల్లి : బీసీ నేత బండారు సత్యనారాయణమూర్తిని అరెస్టు చేయడాన్ని టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షులు పివి.సీతారామరాజు (రవిరాజు), పార్టీ సీనియర్ నాయకులు ఎరిపలి చిట్టిబాబు, జడిచింతువా గ్రామ అధ్యక్షుడు చెలూరి అనండ్లు తీవ్రంగా ఖండించారు. మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు.

మునగపాక రూరల్ : బండారు సత్యనారాయణమూర్తి అరెస్టు అప్రజాస్వామ్యమని తెలుగు యువత ఎలమంచిలి నియోజకవర్గ అధ్యక్షులు పెంటకోట విజయ్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో టిడిపి నాయకులు దాడి ముసలి నాయుడు, భీమరశెట్టి శ్రీనివాసరావు, మల్ల వరాహనరసింహారావు, దొడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా

అక్రమ కేసులపై గవర్నర్ చర్యలు తీసుకోవాలి

అనకాపల్లి : ప్రతిపక్ష నేతలపై జగన్‌రెడ్డి పెడుతున్న అక్రమ కేసులపై గవర్నర్ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీజీపీగా రాజేంద్రనాథ్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నుండి రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయన్నారు. బీసీలపై కక్షతోనే మాజీ మంత్రి బండారుపై అక్రమ కేసులు బనాయించారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధంశెట్టి నీలబాబు, మళ్ళ సురేంద్ర, బిఎస్ఎంకే జోగి నాయుడు, పోలారపు త్రినాథ్, కొణతాల రత్న కుమారి పాల్గొన్నారు.

పోలీసులు తీరు అమానుషం

చట్ట ప్రకారం పని చేయవలసిన పోలీసు యంత్రాంగం జగన్ రెడ్డి, సకల శాఖామంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి ఆదేశాలతో తమకు నచ్చని వారిపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం అనుమాష్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగజగదీశ్వరరావు విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు నడిపల్లి గణేష్, ఆళ్ల రామచంద్రరావు, పెనుమత్స సాయి రాజు, సాలాపు నాయుడు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దుచేయాలి

ప్రజాశక్తి -ములగాడ : పెంచిన విద్యుత్ ఛార్జీలు రద్దు చేయాలని కోరుతూ జివిఎంసి 63 వ వార్డు పరిధి కాకరలోవ, భగత్‌సింగ్ జంక్షన్‌లో సిపిఐ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలతో సతమతమవుతున్న ప్రజలపై విద్యుత్ భారాలు వేసి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, కామేశ్వరరావు, కనకరాజు, ఆర అప్పారావు, గురువులు తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మంగళవారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వైద్యసేవలు మెరుగుపరచండి



వైద్యసేవల పరిస్థితిపై ఆరా తీస్తున్న జనసేన నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కృష్ణదేవిపేట పిహెచ్‌సిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం జనసేన నాయకులతో కలిసి పిహెచ్‌సిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ. గొలుగొండ, కొయ్యూరు మండలాల్లోని పలు గ్రామాల ప్రజలకు వైద్యానికి పెద్దదిక్కుగాఉన్న కేడీపేట పిహెచ్‌సిలో రోగుల తాకిడికి తగ్గట్టుగా వైద్యులు,సిబ్బందిని నియమించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ముఖ్యంగా కుక్కకాటు, పాముకాటు వ్యాక్సిన్లు లేవని, వాటిని అందుబాటులో ఉంచాలన్నారు. కేడీ పేట పిహెచ్‌సిని రౌండ్‌దిక్లాక్ పిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసి, అదనపు పడకలు పెంచి సేవలు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్‌నుకలిసి కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు గండెం దొరబాబు, సలాదుల ప్రసాద్‌బాబు, రేగుబళ్ల శివ, బోళెం చిరంజీవి, వాసం వెంకటేష్, సుబ్బారావు, లంక సత్యనారాయణ, పాల్గొన్నారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న దళిత నేతలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుకు రెండు సెంట్లు స్థలం కేటాయించాలని గొలుగొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ కసిపల్లి అప్పారావుకు మంగళవారం అనకాపల్లి జిల్లా దళిత కులాల సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు చిట్ల చలపతిరావు, జోగంపేట, గొలుగొండ గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

హాకీ శిక్షణకు క్రీడాకారుల ఎంపిక



హాకీ క్రీడాకారులను ఎంపిక చేస్తున్న కోచ్‌లు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో మంగళవారం జిల్లాస్థాయి హాకీ అకాడమీ ఎంపికలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కడప జిల్లా పులివెందులలో 12-18ఏళ్ల బాలురకు టెన్నిస్, హాకీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్ అంశాల్లో శిక్షణనిచ్చేందుకు క్రీడా అకాడమీని ప్రారంభించింది. అక్కడ హాకీ క్రీడలో ఆసక్తి ఉన్నవారిని ఎంపిక కోసం జిల్లాస్థాయిలో శిబిరం నిర్వహించగా, 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.క్రీడాకారులకు శారీరక దారుఢ్యం, క్రీడా నైపుణ్య పరీక్షలను నిర్వహించారు. .జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారులంతా ఈ నెల 10 నుండి పులివెందులలో జరుగు ఎంపికలో పాల్గొంటారని జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు ఎల్‌వి రమణ తెలిపారు. కార్యక్రమంలో హాకీ కోచ్‌లు జి రాంబాబు, పివి.నాగేశ్వరరావు, ఎస్.కె రెహమాన్ , రమేష్, బియస్ హాకీ ఫౌండర్ సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ, రామచంద్ర రావు, రంజిత్, కొల్నాటి నానాజీ, ప్రసాద్, ఆకేటి రమణ పాల్గొన్నారు.

వైద్యులు రామచంద్రరావు మృతి



డాక్టర్ రామచంద్రరావు(ఫైల్)

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : పట్టణానికి చెందిన ప్రముఖ ప్రైవేటు వైద్యుడు పెట్ల రామచంద్రరావు సోమవారం సాయంత్రం మృతి చెందారు. అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్న ఆయన ఆరోగ్య విషమించడంతో మృత్యువాత పడినట్లు కుటుంబసభ్యుల తెలిపారు. రామచంద్రరావు గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్థానిక అధ్యక్షుడు, కార్యదర్శిగా ఆయన పనిచేశారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలందించి, అందరికీ ఆదర్శంగా నిలిచారు. 2004 ఎన్నికల్లో నర్సీపట్నం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఈయన మృతికి పట్టణ ప్రముఖులు, పలు పార్టీల నేతలు, వైద్యులు సంతాపం వ్యక్తం చేశారు. రామచంద్రరావు కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

ముగిసిన సర్వే శిక్షణ తరగతులు



సర్వేలో శిక్షణ పొందుతున్న సిబ్బంది

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూశాఖలోని జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, వీఆర్ఒలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఫీల్డ్ ట్రైనింగ్‌లో భాగంగా ప్రారంభమైన సర్వే శిక్షణ తరగతులు ముగిసాయి. నర్సీపట్నం డిఐఒ ఎస్ వెంకటరమణ, మండల సర్వేయర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణలో భాగంగా కన్వెన్షనల్ మెథడ్స్, ఇటిఎస్, డిజిపిఎస్, తదితర అంశాలలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసామని మండల సర్వేయర్ టీడీవి ప్రసాద్ తెలిపారు. వివిధ మండలాలకు చెందిన 12 మంది రెవెన్యూ సబార్డినేట్ సిబ్బంది శిక్షణ పొందారు.

వినాయకుని పేరుతో వ్యాపారం



ఆర్‌టిసి స్థలంలో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న నిర్వాహకులు

- భక్తులను దోచేస్తున్న నిర్వాహకులు
- ఆర్‌టిసి స్థలంలో పార్కింగ్ ఫీజులు
- చోద్యం చూస్తున్న అధికారులు



పార్కింగ్ స్థలమంటూ బోర్డు పెట్టిన ఉత్సవ నిర్వాహకులు

ప్రజాశక్తి -గాజువాక : ప్రజల సెంటిమెంట్‌ను ఉపయోగించుకొని, దేవుడి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఘటన గాజువాక లంక గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన 117 అడుగుల వినాయకుని విగ్రహం దగ్గర చోటు చేసుకుంటోంది. లంకా గ్రౌండ్‌లో చెర్రీ గణేష్ కాన్సెప్ట్‌గా వినాయకుని ఏర్పాటు చేయడం, తద్వారా డబ్బులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. అప్పట్లో కాంగ్రెస్ నాయకులను, తర్వాత టిడిపి వారిని, ప్రస్తుతం వైసిపి నాయకులను ఉపయోగించుకొని భారీ వినాయక ఏర్పాటుచేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడు. ఈ ప్రాంతంలో 44 షాపుల ఏర్పాటుకు జివిఎంసి నుంచి అనుమతి తీసుకున్నారు. కానీ 87 షాపులు ఏర్పాటుచేశారు. 43 షాపులకు కమర్షియల్ పర్మిషన్ తీసుకోకుండా ఒక్కొక్క షాపు నుంచి రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తెలివిగా అధికారంలో ఉన్న పార్టీ నేతలను వినియోగించుకుంటున్నాడు. రథం పూజకు స్థానిక ప్రజాప్రతినిధులు ఆహ్వానించడంతో జివిఎంసి, గాజువాక పోలీస్, ట్రాఫిక్, ఫైర్ సిబ్బంది తదితరులెవరూ ఆయన వైపు కన్నెత్తి చూడడానికి సాహసించడం లేదు. దీంతో నిర్వాహకులు ఇష్టానుసారంగా భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. దర్శనానికి మూడు క్యూలైన్లు ఏర్పాటు చేసి రూ.25, రూ.50, రూ.100 టిక్కెట్లు వసూలుచేస్తున్నారు. చెప్పులు విడిచిపెట్టే దగ్గర కూడా బలవంతంగా వసూలుకు పాల్పడుతున్నారు.

ఆర్‌టిసి స్థలంలో పార్కింగ్‌కూ ఫీజు

గణేషుని విగ్రహం పెట్టిన ప్రాంతానికి ఆనుకొని ఆర్‌టిసి స్థలం 1500 గజాలు ఉంది. భక్తుల వాహనాల పార్కింగ్ కోసమని ఆ స్థలంలో నిర్వాహకులు ముందుగా అనుమతి తీసుకున్నారు. కానీ వాహనాల పార్కింగ్‌కు రూ.20 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఈ వినాయకుని విగ్రహాన్ని దర్శించుకునేందుకు రావాలంటే ఒకొక్కరి నుంచీ రూ.500 నుంచి రూ.1000 నిలువు దోపిడీకి గురవుతున్నారు.

ఎగ్జిబిషన్‌కు అనుమతులు లేవు

నగరంలో ఎక్కడైనా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలంటే జివిఎంసి అనుమతులు తీసుకోవాలని అలాంటిదేమీ లేకుండానే యథేచ్ఛగా ఇక్కడ ఎగ్జిబిషన్ నడుపుతున్నారు. అయినా అధికారులు కనీసం నోటీసులు జారీ చేసిన దాఖలాలు కూడా లేవు.

ఆర్‌టిసి స్థలంలో పార్కింగ్ చేసిన వాహనాలకు నిర్వాహకులు ఫీజు వసూలు చేయడంపై డిపో మేనేజర్‌ను వివరణ కోరగా, తాను స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. జోనల్ కమిషనర్ సింహాచలాన్ని వివరణ కోరగా సిబ్బందిని పంపించి అనుమతులున్న షాపులను ఉంచి మిగతా వాటిని తొలగిస్తామని చెప్పారు.

రోడ్డు విస్తరణ ద్వారా అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ప్రధాన రోడ్డు విస్తరణపై కోర్టుకు వెళ్లిన వ్యాపారస్తులు ఇతర వర్గాల వారు అభివృద్ధిలో సహకరించాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విజ్ఞప్తి చేశారు. ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా డ్రైనేజీల మార్కింగ్ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నర్సీపట్నం మున్సిపాలిటీలో రోడ్ల విస్తరణకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత డిసెంబర్ లో శంకుస్థాపన చేశారన్నారు. డ్రైనేజీలకు, ప్రధాన రోడ్డు నిర్మాణానికి రూ.8 కోట్ల 30 లక్షలు మంజూరు చేశారని, టెండర్ ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందన్నారు. రోడ్డు మధ్యలో సెంటర్ లైటింగ్, పచ్చదనం కోసం రూ. 2 కోట్ల 30 లక్షలు మంజూరవ్వగా దానికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న భవన యజమానులు 260 మంది ఉన్నారని, వారిలో 110 మంది టిడిఆర్ బాండ్లకు ఒప్పుకొని సంతకాలు చేశారన్నారు.కోర్టుకు వెళ్లిన వారికి ల్యాండ్ ఎక్విజిషన్ ద్వారా కానీ, టిడిఆర్ బాండ్ల ద్వారా కానీ ఒప్పించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోర్టు తెలిపిందన్నారు. ఇప్పటికే 91 మందికి ల్యాండ్ ఎక్విజిషన్ చేస్తున్నట్లు పత్రికలలో నోటిఫికేషన్ ఇచ్చామని, రెండు నెలలలోగా అభ్యంతరాలు తెలపాలని కోరినట్లు వెల్లడించారు. అబీద్ సెంటర్ నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు బుధవారం డ్రైనేజీల నిర్మాణం చేపడతామన్నారు. వెంకటేశ్వర స్వామి గుడి నుండి పెద్ద బొడ్డేపల్లి వరకు రోడ్డు వెడల్పుకు రూ.6 కోట్లు మంజూరయ్యాయని, మరో వారం రోజుల్లో టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. నర్సీపట్నం అభివృద్ధిలో అన్ని వర్గాలు, పార్టీల వారు కలిసి రావాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాల్సిందే...

కేంద్ర మంత్రి అజయ్‌మిశ్రాను బర్తరఫ్ చేయాలి

- బ్లాక్ డే నిరసనల్లో నేతలు



అనకాపల్లిలో కార్మికుల బ్లాక్‌డే నిరసన

పోరాట సమయంలో కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాల్సిందేనని పలువురు నేతలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బ్లాక్ డే నిర్వహించారు. మోడీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయాలని పోరాడిన రైతులపై లఖింపూర్ కేరీలో కేంద్ర సహాయ మంత్రి అజయ్‌మిశ్రా తనయుడు అషితోష్ మిశ్రా కారు ఎక్కించి ప్రాణాలు తీసి రెండేళ్లయినా ఎటువంటి చర్యలూ తీసుకోకపోవడం దుర్మార్గమని, తక్షణమే ఆ కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలని, ఆశితోష్ మిశ్రాపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు డిమాండ్ చేశారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన బ్లాక్ డే నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఎలాంటి పోరాటం నడిపారో వివరించారు. వారికి మద్దతుగా దేశ కార్మికులు, ప్రజలు నిలిచారన్నారు. చివరకు మోడీ ప్రభుత్వం దిగొచ్చి ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. నాడు రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని, పాత చట్టాలను అమలు చేస్తామని, కనీస మద్దతు ధర ఇస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిఎస్‌కె.అచ్యుతరావు, ఎం.మన్మధరావు, సిఐటియు నాయకులు పి.వెంకటరావు, సత్యన్నారాయణ, కెవిపి చంద్రమౌళి, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు, ఎఐటియుసి నాయకులు మసేన్ పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : లఖింపూర్ ఖేరీ ఘటనలో కాన్వాయ్‌తో రైతులను తొక్కించి చంపిన బిజెపి కేంద్రమంత్రి అజయ్ మిశ్రాను అరెస్టు చేసి శిక్షించాలని సిఐటియు డిమాండ్ చేసింది. లఖింపూరి ఖేరీ ఘటనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కృష్ణాబజార్ లో సిఐటియు అధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నిరసన చేపట్టారు. సిఐటియు డివిజన్ నాయకులు ఈరెల్లి చిరంజీవి, ముఠా కార్మిక సంఘం ప్రెసిడెంట్ రుత్తల గోవింద్, కె. నానాజీ పాల్గొన్నారు.

అనకాపల్లి : సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపుమేరకు మంగళవారం అనకాపల్లి నెహ్రూ జంక్షన్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంలో 2021 అక్టోబర్ 3న రైతుల ర్యాలీపై కర్కశంగా వాహనంతో తొక్కించి నలుగురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమైన కేంద్ర బిజెపి మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడిని రెండేళ్లగా అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే కేంద్ర మంత్రిని తొలగించాలని, మంత్రి కుమారుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు, కార్మిక సంఘాల నాయకులు వైఎస్ భద్రం, బాలు గాడి, వివి.శ్రీనివాసరావు, కొరుబిల్లి శంకర్రావు, ఆర్ శంకరరావు, ఎం.అప్పలరాజు, కోన లక్ష్మణ, కాళ్ల తేలయ్యబాబు, కొల్లి సత్యారావు, వియ్యపు రమణ పాల్గొన్నారు.

పరవాడ : బ్లాక్‌డే సందర్భంగా పరవాడ ఫార్మాసిటీలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగళి అప్పారావు, పైలా తాతబాబు, ఎం.సన్యాసిరావు, మంత్రి శ్రీను, సుక్క అక్కు నాయుడు, వర్రి సత్తిబాబు, ఆర్.ఈశ్వరరావు, వి అప్పారావు, వి సన్యాసిరావు పాల్గొన్నారు.

రాంబిల్లి : బ్లాక్ డే సందర్భంగా రాంబిల్లిలో సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడు నాయుడు, మండల కన్వీనర్ సిహెచ్.రామకృష్ణ, రైతు సంఘం నాయకులు చిన్న అప్పారావు పాల్గొన్నారు.